క్లుప్తంగా

సీతారాముల కల్యాణానికి పసుపు రాట

కొత్తపల్లి: వాకతిప్ప శాలివాహన పద్మశాలి రామాలయం వద్ద సీతారాముల కల్యాణ మహోత్సవాలకు ఆదివారం భక్తులు పసుపు రాట వేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఏప్రిల్ 6న జరగనున్న కల్యాణ మహోత్సవాలకు మండలంలోని ఆలయాలను ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విద్యుద్దీపాలు, రంగులతో సుందరంగా అలంకరిస్తున్నారు.

నూకాలమ్మ ఆలయంలో భక్తుల తాకిడి



సామర్లకోట నూకాలమ్మ ఆలయంలో బారులు తీరిన భక్తులు

సామర్లకోట: గ్రామ దేవతగా ప్రసిద్ధి చెందిన స్థానిక స్టేషన్ సెంటర్‌లోని నూకాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. కొత్త అమావాస్యను పురస్కరించుకుని ఏటా ఆలయంలో నెల రోజుల పాటు జరిగే అమ్మవారి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉగాదిని పురస్కరించుకుని అనేక గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉచిత దర్శనంతో పాటు, రూ.20 క్యూలైన్లను ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.

చోరీల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

కొత్తపల్లి: వేసవిలో చోరీల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎస్సై జి.వెంకటేష్ అన్నారు. ఆదివారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ, వేసవిలో ఇంటికి తాళాలు వేసి వెళ్లేవారు పోలీసులకు ముందుగా సమాచారాన్ని ఇవ్వాలన్నారు. తీర ప్రాంతంలో రాత్రివేళ ప్రయాణం చేసేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో జాతరలు, తీర్థాల పేరుతో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే తమకు తెలియజేయాలన్నారు. సారా తయారీ, విక్రయం చట్టరీత్యా నేరమని, ఎవరైనా ఈ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం



సామర్లకోట సాయిబాబా మందిరం వద్ద చిన్నారుల కోలాటం

సామర్లకోట: పట్టణంలోని స్టేషన్ సెంటర్‌లోని షిరిడీ సాయిబాబా మందిరం వద్ద ఉగాది సందర్భంగా ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన కోలాటం ఆకట్టుకుంది. ఉగాది సందర్భంగా ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు బాబావారిని దర్శించుకున్నారు. ఉదయం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప బాబా వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చుండ్రు బలరామ్, ఆస్పత్రి అభివృద్ధి మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, జిల్లా కబడ్డీ సంఘ ప్రతినిధులు నిమ్మకాయల కిరణ్, బడుగు శ్రీకాంత్, ఆలయ కమిటీ నాయకులు భక్తులకు సేవలందించారు.

నిలకడకేదో?

- తరలిపోతున్న తహసీల్దార్ కార్యాలయం
- ప్రస్తుతం పరాయి పంచన సేవలు
- ఐసీడీఎస్ భవనంలోకి మార్చేందుకు సిద్ధం

సామర్లకోట: రెవెన్యూ సేవలకు మండలంలో కీలకమైన తహసీల్దార్ కార్యాలయం మార్పు చేయడానికి రంగం సిద్ధమవుతోంది. స్థానిక పిఠాపురం రోడ్డులో వీఆర్‌కే ప్రభాకరరావు తహసీల్దార్‌గా ఉన్న సమయంలో పాతికేళ్ల క్రితం పాత పోలీసు స్టేషన్ సమీపంలో సొంత భవనం నిర్మించారు. క్రమేణా తహసీల్దార్ కార్యాలయంలో సేవలు విస్తృతం కావడం, ప్రతి రెండు రోజులకోసారి సిబ్బందితో సమావేశాలు నిర్వహించాల్సి ఉండటంతో భవనం ఇరుకుగా ఉందని అప్పటి తహసీల్దార్ డిప్యూటీ సీఎంగా ఉన్న నిమ్మకాయల రాజప్ప దృష్టికి తీసుకెళ్లారు. దాంతో అప్పటికే ఎంపీడీఓ కార్యాలయానికి నూతన భవనం నిర్మించడంతో, పాత భవనం ఖాళీగా ఉంది. ఈ క్రమంలో పాత ఎంపీడీఓ కార్యాలయానికి స్వల్ప మరమ్మతులు చేసి 2016లో అందులోకి తహసీల్దార్ కార్యాలయాన్ని మార్చారు. పాత భవనం సమితి కార్యాలయం నాటిది కావడంతో, శిథిలమై భారీ వర్షాలకు శ్లాబ్ నుంచి వర్షపు నీరు దిగి రికార్డులు తడిసిపోతున్నాయి. ఈ విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తేవడంతో భవనం మార్చాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. తహసీల్దార్ కార్యాలయానికి స్థలం అందుబాటులో ఉన్నప్పటికీ, భవన నిర్మాణానికి రూ.కోటి వరకు నిధులు అవసరం. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని ఖాళీగా ఉన్న ఐసీడీఎస్ భవనంలోకి మార్చేందుకు చర్యలు చేపట్టారు.



నిరుపయోగంగా ఉన్న పాత తహసీల్దార్ కార్యాలయం

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

పిఠాపురం రోడ్డులోని పాత తహసీల్దార్ కార్యాలయం తొమ్మిదేళ్ల పాటు నిరుపయోగంగా ఉండడంతో, కార్యాలయంలో రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. వినియోగంలో లేకపోవడంతో భవనం శిథిలమయ్యే అవకాశం ఉంది. ప్రధాన గేటుకు తాళం కూడా వేయకపోవడంతో అనేక మంది దీనిని సొంత భవనంలా ఉపయోగించుకుంటున్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి వెళ్లడంతో, శనివారం ప్రధాన గేటుకు తాళం వేయించారు. సుమారు 20 ఏళ్ల క్రితం సామర్లకోట తహసీల్దార్ కార్యాలయానికి జనరేటర్ మంజూరైంది. అది సుమారు 15 ఏళ్ల నుంచి నిరుపయోగంగా ఉంది. సొంత తహసీల్దార్ కార్యాలయాన్ని వినియోగంలోకి తేవాలనే డిమాండ్ ఉంది.



పాత ఎంపీడీఓ ఆఫీసులో ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ కార్యాలయం



కార్యాలయ మార్పునకు సిద్ధమవుతున్న ఐసీడీఎస్ భవనం

పాత భవనాన్ని అభివృద్ధి చేయాలి



పిఠాపురం రోడ్డులో ఉన్న పాత తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న ఖాళీ స్థలాన్ని ఉపయోగించి, భవన విస్తీర్ణం పెంచడం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ఐసీడీఎస్ కార్యాలయంలోకి మార్పు చేయడానికి రూ.20 లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఆ నిధులతో సొంత భవనం విస్తీర్ణమవుతుంది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారికి బలుసులపేటలోని కార్యాలయం గుర్తించడం కష్టంగా ఉంటుంది. జిల్లా స్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయాలి.

– తాటికొండ అచ్చిరాజు, మాజీ సొసైటీ అధ్యక్షుడు, నవర

త్వరలో కార్యాలయం మార్పు



తహసీల్దార్ కార్యాలయాన్ని త్వరలో మార్పు చేస్తాం. నిరుపయోగంగా ఉన్న ఐసీడీఎస్ భవనానికి జిల్లా కలెక్టర్ రూ.23 లక్షలు విడుదల చేశారు. దీనిలో రూ.15 లక్షలు తహసీల్దార్ కార్యాలయంగా కేటాయించిన భవనానికి కేటాయించారు. పనులు వేగంగా జరుగుతున్నాయి, దాతల సహకారంతో మిగిలిన పనులు పూర్తి చేస్తాం. ఐసీడీఎస్ కార్యాలయంలో తహసీల్దార్ కార్యాలయానికి కేటాయించిన భవనం అత్యంత విశాలంగా ఉంది. పాత తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేయించాం. జనరేటర్‌కు బహిరంగ వేలం నిర్వహిస్తాం.

– కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, తహసీల్దార్, సామర్లకోట

వసంత నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం



పంచారామ క్షేత్రంలో సత్కారం అందుకున్న అర్చకులు, దాతలు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో ఉగాదిని పురస్కరించుకొని వసంత నవరాత్ర ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజతో కార్యక్రమం జరిగింది. పుణ్యాహవాచనం, రుత్వికుల రక్షాబంధనం, కలశస్థాపనతో వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. ఆదివారం నుంచి ఏప్రిల్ 7 వరకు నిత్యం ఉదయం, సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. ఆలయ పండితుడు వేమూరి సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయ పండితులు, మహా శివరాత్రికి సేవలందించిన దాతలను ఘనంగా సత్కరించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు, ఆలయ సూపరింటెండెంట్ ఈశ్వరరావు, భక్త సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా భీమేశ్వరస్వామి కల్యాణం



సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం



భీమేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

సామర్లకోట: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి వారి కల్యాణం ఆదివారం నేత్ర పర్వంగా జరిగింది. ఆలయ భక్త సంఘ నాయకుడు బిక్కిన సాయి దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి కల్యాణం జరిపించారు. నంది మండపం వద్ద ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై స్వామివారి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను ఉంచి ఆలయ పండితులు తొలుత విఘ్నేశ్వర పూజ చేసి కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈఓ బళ్ల నీలకంఠం, సూపరింటెండెంట్ ఈశ్వరరావు, భక్త సంఘం నాయకులు, ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు తదితరులు భక్తులకు సేవలందించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

భీమేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు

పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉగాదిని పురస్కరించుకుని స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కేంద్ర పురావస్తు శాఖ ఆదేశాల మేరకు తొలి అభిషేకం మాత్రమే పాలతో చేస్తున్నారు. మిగిలిన సమయంలో నీటితో అభిషేకాలు చేస్తున్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

పాదగయ క్షేత్రంలో ఎస్పీ బిందుమాధవ్ పూజలు



హోమంలో పాల్గొన్న ఎస్పీ బిందుమాధవ్ దంపతులు



పాదగయ క్షేత్రంలో పంచాంగ శ్రవణం

పిఠాపురం: కాకినాడ జిల్లా ఎస్పీ పి.బిందు మాధవ్ దంపతులు ఉగాదిని పురస్కరించుకుని కుక్కుటేశ్వర స్వామివారి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరి దేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక హోమం నిర్వహించిన ఎస్పీ దంపతులకు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం పలికారు. అనంతరం ఆలయ ఈఓ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ వారికి శేష వస్త్రాలు, స్వామివారి చిత్ర పటం, ప్రసాదం అందజేశారు. ఆయన వెంట పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్సై మణికుమార్ తదితరులున్నారు.

పాదగయ క్షేత్రంలో వేడుకలు

శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా పిఠాపురం పాదగయ క్షేత్రంలో ఆదివారం పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని వేద పండితులు ద్విభాష్యం సుబ్రహ్మణ్యం శర్మ నిర్వహించారు. అనంతరం వేద పండితులకు, అర్చకులకు ఆలయ ఈఓ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ గౌరవ సంభావన అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పాస్టర్ మృతిపై న్యాయ విచారణ చేయాలి

కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ



సామర్లకోటలో కొవ్వొత్తుతో నిర్వహిస్తున్న ప్రదర్శన

సామర్లకోట: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై న్యాయ విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ మండల పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ఆదివారం సాయంత్రం భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక సీబీఎం సెంటర్ నుంచి మెహర్ కాంప్లెక్స్, మఠం సెంటర్ మీదుగా స్టేషన్ సెంటర్‌కు చేరుకుని ధర్నా చేశారు. ప్రవీణ్ మృతిపై న్యాయ విచారణ చేయాలని, క్రైస్తవులపై దాడులు అరికట్టాలని నినాదాలు చేశారు. ధర్నా అనంతరం కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ మడికి సోనియా మాట్లాడుతూ, హైదరాబాద్‌కు చెందిన పాస్టర్ ప్రవీణ్ మృతిపై అనేక అనుమానాలున్నాయని చెప్పారు. కొనేళ్లుగా క్రైస్తవులపై దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవీణ్ మృతిపై సీబీఐతో విచారణ చేసి, ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, మైనార్టీ కోఆప్షన్ సభ్యుడు సల్లూరి కల్యాణ్, మండల పాస్టర్ల సంఘ ప్రతినిధులు టి.బ్లెసింగ్, కె.జయబాబు, జె.జయరాజు, చంటి, లాజరస్, వై.కరుణకుమార్, పి.తిమోతీ, పి.ఆనంద్‌బాబు, ఎంఏ జేమ్స్, వి.జాన్, కిరణ్‌కుమార్, ఎస్.సైలాస్, బెంజిమాన్, ఎం.సాల్మన్‌రాజు, కరుణానిధి పాల్గొన్నారు. భారీ సంఖ్యలో శాంతి ర్యాలీ క్రైస్తవులు పాల్గొనడంతో, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

క్రైస్తవుల ర్యాలీ

కొత్తపల్లి: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతి నేపథ్యంలో ఉప్పాడ, అమీనాబాద్‌లో ఉన్న క్రైస్తవ బోధకుల ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ కొనసాగింది. పోలీసులు దర్యాప్తు వేగవంతం చేయాలని వినతిపత్రాన్ని అందించారు. వాస్తవాలను తేల్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.



ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

పంటలు బాగా పండుతాయి



సామర్లకోట మాండవ్య నారాయణస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం

సామర్లకోట: ఉగాది సందర్భంగా మాండవ్య నారాయణస్వామి ఆలయంలో ఆదివారం పండితులు పంచాగ శ్రవణం నిర్వహించారు. రైతు సంఘం ఆధ్వర్యంలో పండితులు బోనాల సురేష్‌శర్మ, చాడ హనుమశాస్త్రి పంచాగ శ్రవణం నిర్వహించగా, రైతులు ఆసక్తిగా ఆలకించారు. అగ్ని ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తాయని, వర్షాలు అధికంగా కురియడంతో పంటలు బాగా పండుతాయని పండితులు చెప్పారు. బళ్ల మార్కెట్ సెంటర్‌లోని కనక మహాలక్ష్మి ఆలయంలో అళ్లకి కాశీవిశ్వనాథం ఆధ్వర్యంలో పంచాగ శ్రవణం జరిగింది.

సంస్కృతి పరిరక్షణ అందరి బాధ్యత

పెద్దాపురం: దేశ సంస్కృతి, సంప్రదాయ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పలువురు వక్తలు అన్నారు. స్థానిక దేవాలయాల్లో ప్రంచాగ శ్రవణంలో పలువురు వక్తలు మాట్లాడుతూ, ఈ ఏడాది ప్రజలకు మంచి చేకూరాలని ప్రార్థిస్తున్నామన్నారు. పులిమేరులో శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్లు రాయవరపు వీరబాబు, సత్య దంపతుల ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకున్నారు. పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేద పండితులు పంచాగ శ్రవణం నిర్వహించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మెయిన్‌రోడ్డులో భువనేశ్వరి పీఠం ఆధ్వర్యంలో పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఐదు వేల మందికి మజ్జిగను పంపిణీ చేశారు.

వైభవంగా ఉత్సవాలు

పిఠాపురం: నియోజకవర్గంలో ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్, సహృదయ మిత్ర మండలి సంయుక్త ఆధ్వర్యంలో వరద వీరవెంకట నరసింహం మెమోరియల్ ట్రస్ట్ సౌజన్యంతో ఉగాది వేడుకలు, కవి సమ్మేళనం స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహించారు. ఎనిమిది మంది కవులు ఉగాది సందేశాలు ఇచ్చారు. ముగ్గురు ఉగాది విశిష్ట ఆదర్శ దంపతులను సత్కరించారు.



కవులను సత్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగ ప్రతినిధులు

వేణుగోపాల స్వామి ఆలయంలో..

రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అనంతరం విశేష సహస్ర నామ పూజ నిర్వహించారు. మధ్యాహ్నం ఇంద్రగంటి గోపాలకృష్ణ శర్మ పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈఓ నున్న శ్రీరాములు, అర్చకులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి ఆలయంలో..

పట్టణంలోని దత్తనగర్‌లో ఉన్న లక్ష్మీగణపతి స్వామివారి ఆలయంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. వేద పండితులు మధుశర్మ, మోహనశర్మ సోదరులు పంచాంగ శ్రవణం నిర్వహించారు.

ఉగాది పచ్చడి పంపిణీ

కొత్తపల్లి: ఉగాది సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. కొత్తపల్లిలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి, బాలాత్రిపుర సుందరి సమేత రాజశేఖరస్వామి, శ్రీధర్మశాస్తా, ఉప్పాడలోని మత్స్యలింగేశ్వర స్వామి, వేంకటేశ్వర స్వామి, చౌడేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి, రమణక్కపేటలో విజయ జనార్దనస్వామి, మూలపేటలో జగన్నాథ స్వామితో పాటు, నాగులాపల్లి, గోర్స గ్రామాల్లోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

మీకు మీరే.. మాకు మేమే..

- కూటమి నేతల మధ్య అగాధం పెంచిన ఉగాది
- ఎవరికి వారే అన్నట్టుగా వేడుకలు
- శ్రీరాంపురంలో జాతరలో ఆచారాలకు జనసేన నేతల అడ్డంకులు



తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉగాది ఉత్సవాల్లో వర్మ



మున్సిపల్ కల్యాణ మండపంలో ఉగాది ఉత్సవాల్లో జనసేన నేతలు

పిఠాపురం: ఎలాంటి పోరుకైనా సై అంటున్న టీడీపీ–జనసేన నేతల మధ్య ఉగాది మరింత అగాధాన్ని పెంచింది. ఎవరికి వారే, యమునా తీరే అన్నట్లుగా.. వేర్వేరుగా ఉగాది ఉత్సవాలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల నిర్వహించిన జనసేన ఆవిర్భావ సభలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మను ఉద్దేశించి జనసేన నేత నాగబాబు చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయా వర్గాల మధ్య పోరు మరింత ముదిరింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇలాకాలో పారిశుధ్యం అధ్వానంగా ఉందంటూ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత ఎస్వీఎస్ఎన్ వర్మ జిల్లా కలెక్టరుకు చేసిన ఫిర్యాదు రెండు పార్టీల మధ్య మరింత వివాదాన్ని రేపింది. ప్రజా సమస్యల పరిశీలన అంటూ పట్టణంలో జగ్గయ్య చెరువు కాలనీలో పర్యటించి, అక్కడ పారిశుధ్యం అధ్వానంగా ఉందని, ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, ఎవరూ పట్టించుకోవడం లేదంటూ కాకినాడలో జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వంలో, అదీ ఉప ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ఆయనకు వ్యతిరేకంగా ప్రజా సమస్యలను అడ్డు పెట్టుకుని, ఉద్దేశపూర్వకంగా ఫిర్యాదు చేశారని జనసేన నేతలు మండిపడుతున్నారు.

అదంతా డ్రామాయే..!

గత ఫిబ్రవరి 15న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిఠాపురం జగ్గయ్య చెరువు కాలనీలో ఉన్న ముంపు సమస్య పరిష్కారానికి రూ.20 కోట్ల పనులకు ఆమోదం తెలిపి, నిధులు మంజూరు చేసి, వెంటనే పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకున్నారని జనసేన నేతలు చెబుతున్నారు. ఇంతలో వర్మ అక్కడకెళ్లి హడావిడి చేసి, నిధులు మంజూరై, పనులు చేపట్టింది తన వల్లేనని చెప్పుకోవడానికే ఈ డ్రామా ఆడుతున్నారని జనసేన నేతలు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. కాగా ఆదివారం పిఠాపురంలో నిర్వహించిన ఉగాది సంబరాలు, రంజాన్ ఇఫ్తార్ విందు కార్యక్రమాలకు కేవలం జనసేన కేడర్‌కు మాత్రమే ఆహ్వానాలు పంపడం గమనార్హం. పాయా కార్యక్రమాలకు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కుడా చైర్మన్ తుమ్మల బాబు, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించగా, టీడీపీ నేత వర్మ విడిగా తన కార్యాలయంలో ఉగాది ఉత్సవాలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.

జాతరలోనూ అడ్డంకులు

కొత్తపల్లి మండలం శ్రీరాంపురంలో గొల్లమారెమ్మ అమ్మవారి జాతరలో పూర్వం నుంచి వస్తున్న ఆచారానికి అడ్డంకులు కల్పించారు జనసేన వర్గాలు. శ్రీరాంపురంలో గ్రామ దేవత అయిన గొల్లమారెమ్మ అమ్మవారి ఉత్సవాల ముగింపు రోజున గ్రామంలో ఒక కుటుంబం అమ్మవారికి కుంభం సమర్పించడం ఏళ్ల నాటి ఆచారంగా వస్తోంది. శనివారం అర్ధరాత్రి అమ్మవారి జాతర ముగింపు సందర్భంగా తామే కుంభం సమర్పిస్తామంటూ జనసేవ వర్గాలు దౌర్జన్యానికి దిగారని స్థానికులు మండిపడుతున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఈ ఆచారానికి ఎప్పుడూ అడ్డు చెప్పలేదు. కానీ జనసేన వర్గాలు తమదే అధికారం కాబట్టి తామే కుంభం వేస్తామంటూ అడ్డుకోవడంపై గ్రామస్తులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ కారణంగా అర్ధరాత్రి వేయాల్సిన కుంభం తెల్లవారుజాము వరకు కదలకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి రెండు వర్గాలను శాంతింప చేసి అమ్మవారి కుంభం వేసేలా చర్యలు తీసుకున్నారు. సనాతన ధర్మం అంటూ ప్రచారం చేసుకునే పవన్ కల్యాణ్ ఇలాకాలో సంప్రదాయాలను ఆయన పార్టీ నేతలే మంటగలపడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.